క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: మల్లాపూర్ పారిశ్రామికవాడలో ఫీడర్ల మరమ్మత్తుల కారణంగా మల్లాపూర్ సెక్షన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు మల్లాపూర్ ఏఈ క్రిష్టయ్య తెలిపారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 11 కేవీ ఫీడర్ సాయినగర్, బెల్, స్టాండడ్ టైల్స్, 11 కేవీ మల్లాపూర్ పారిశ్రామిక వాడలో సరాఫరా నిలిపి వేస్తున్నట్లు

మంత్రి ప్రత్యేక పూజలు



ఉప్పల్ : ఉప్పల్ ఎన్‌జీఆర్‌ఐ ఆభయాంజనేయ స్వామి ఆలయంలో మంత్రి సత్యవతి రాథోడ్, చిలుకానగర్ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్‌తో కలిసి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్త్రీ,శిశు సంక్షేమ శాఖ కమిషనర్ భారతిహూలికెలి పాల్గొన్నారు.

హైలెవెల్ కమిటీ సభ్యుడిగా శ్రవణ్

మల్కాజిగిరి: వీధి కుక్కల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, జాగ్రత్తలపై జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన హైలెవెల్ కమిటీలో మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ సభ్యుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్,బీజేపీ, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీల నుంచి కార్పొరేటర్లు సభ్యులుగా ఉన్నామన్నారు. వీధి కుక్కల నివారణకు, ప్రజలు ఇబ్బందులు లేకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచిస్తామన్నారు.

చక్కగా.. చూడముచ్చటగా...

- హబ్సిగూడ టు ఎల్‌బీనగర్ మోడల్ కారిడార్
- గ్రీన్ హబ్సిగూడ ఏర్పాటు దిశగా..
- పారిశుద్ధ్యంపై అధికారుల ప్రత్యేక దృష్టి



హబ్సిగూడ నుంచి నాగోల్ బ్రిడ్జి వరకు ఇలా విదేశీ తరహాలో ఏర్పాటు కానున్న మోడల్ కారిడార్

ఉప్పల్ : అభివృద్ధి చెందిన దేశాలలో ఉన్నట్లు నగరంలో కూడా మోడల్ కారిడార్లకు యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభమయ్యాయి. ఇందుకు పైలెట్ ప్రాజెక్టుగా రూ.15 కోట్లతో వ్యయంతో హబ్సిగూడ చౌరస్తా నుంచి ఎల్‌బీనగర్ కూడలి వరకు మోడల్ కారిడార్ నిర్మాణ పనులు ఇటీవల మొదలయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా ఫుట్ పాత్‌లు, సైకిల్ ట్రాక్‌లు, సర్వీస్ రోడ్డు, గ్రీనరీ ఇలా రహదారి చూడముచ్చటగా, ప్రజా భద్రతకు భరోసా కలిగించేలా కారిడార్ నిర్మాణం జరుగుతోంది.

- హబ్సిగూడ చౌరస్తా నుంచి ఎల్‌బీనగర్ చౌరస్తా వరకు 200 అడుగులు కేటాయించగా గ్రీనరీకి నాలుగు ఫీట్లు, సైకిల్ ట్రాక్‌కు ఆరు ఫీట్లు, ఫుట్‌పాత్‌కు 10 అడుగులు, సర్వీస్ రోడ్డుకు 10 ఫీట్లు కేటాయించనున్నారు.

చెత్త వేసే వారిపై దృష్టి



జీహెచ్ఎంసి అధికారులు ఇప్పటికే రోడ్లపై చెత్త వేసే వారిపై చర్యలకు ఉపక్రమించారు. మొదటగా భవన నిర్మాణ వ్యర్థాలను రోడ్లపై ఇష్టానుసారంగా వేసే వారిపై చర్యలు తీసుకోనున్నారు. ఇంట్లోని వ్యర్థాలు స్వచ్ఛ కార్మికులకు ఇవ్వకుండా రోడ్డు పక్కన, ఖాళీ స్థలాల్లో వేస్తే చర్యలకు ఉపక్రమిస్తున్నారు. ఇప్పటికే కరపత్రాలు, ఆటోల్లో ప్రచారం ప్రారంభించారు. అపార్టుమెంట్ల అసోసియేషన్లు, స్థానికులు, విద్యార్థుల సహకారంతో విశ్వనగరంగా తీర్చేందుకు సిద్ధమవుతున్నారు. స్వచ్ఛకార్మికులకు చెత్త ఇచ్చేటపుడు తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి ఇవ్వాలంటున్నారు.

స్వచ్ఛ టాయ్‌లెట్స్ ఏర్పాటు

బహిరంగ మూత్ర విసర్జన చేసేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నారు. ప్రతి కూడలిలో ఒక స్వచ్ఛ టాయిలెట్‌ను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే మహిళలకు ఇబ్బంది కలుగకుండా ఉండేందుకు ప్రత్యేకంగా షీ మొబైల్ షటిల్ టాయిలెట్స్‌ను ఉప్పల్, హబ్సిగూడ వీధి, ఉప్పల్ స్టేడియం వద్ద ప్రత్యేక మొబైల్ బస్సులను అందుబాటులో ఉంచారు.



ఉప్పల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన షీ మొబైల్ టాయిలెట్స్ (ఫైల్ ఫోటో)

గ్రీన్ హబ్సిగూడగా మారుస్తాం



- హబ్సిగూడను గ్రీన్ హబ్సిగూడగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.
- విశ్వనగరంగా మార్చడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ముఖ్యంగా పారిశుద్ధ్యంపై దృష్టిసారిస్తున్నాం.
- వ్యర్థాలు, బిల్డింగ్ మెటీరియల్ రోడ్లపై వేస్తే భారీ ఎత్తున జరిమానా విధిస్తాం.
- స్వచ్ఛకార్మికులు విధులకు రాకపోయినా వారిపై చర్యలు తీసుకుంటాం.
- ప్లాస్టిక్ కవర్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నివారణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.

అరుణ కుమారి,
ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్

ఏఎస్‌రావు నగర్‌లో వైట్‌హౌస్ స్టోర్



లక్డీకాపూల్ : మెన్స్‌వేర్ బ్రాండ్స్‌ను అందించడంలో ఖ్యాతి చెందిన వైట్ హౌజ్ స్టోర్ ఇప్పుడు సికింద్రాబాద్‌లోని ఏఎస్‌రావు నగర్‌లో అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా అందుబాటు ధరలకు బ్రాండెడ్ క్వాలిటీ దుస్తులను అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 18 ఏళ్ల నుంచి 65 సంవత్సరాలు పైబడిన పురుషులకు అవసరమైన వివిధ రకాల బ్రాండెడ్ దుస్తులను అందుబాటులోకి తెచ్చామన్నారు.

డివిజన్ సమగ్రాభివృద్ధికి కృషి

కుషాయిగూడ: అభివృద్ధి పనులు చేపడతూ డివిజన్ సమగ్రాభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నట్లు కార్పొరేటర్ ప్రభుదాస్ తెలిపారు. డివిజన్ పరిధిలోని హెచ్‌బీకాలనీ ఫేస్-2 కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పనులను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. ఎప్పటికప్పుడు డివిజన్ అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులు చేపడుతు ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి, పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ చారి, బీఆర్ఎస్ నేతలు నరేందర్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రభుదాస్

సందడి చేసిన విద్యార్థులు



ప్రదర్శనను తిలకిస్తున్న సీఐఎస్ఎఫ్ కమాండర్ విజయ్‌కుమార్ వర్మ

కుషాయిగూడ: ద రిథమ్ ఆఫ్ నారాయణ కాన్సెప్ట్‌తో ఈసీఐఎల్‌లోని నారాయణ పాఠశాలలో శనివారం నిర్వహించిన ఎరుడిషన్ ఎక్స్ పో-2023 అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి సీఐఎస్ఎఫ్ కమాండర్ విజయ్‌కుమార్ వర్మ, నారాయణ గ్రూప్స్ జీఎం గోపాల్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఏజీఎం పురోషోత్తంరెడ్డి, ప్రిన్సిపల్ మంజుభారవి తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరం

కుషాయిగూడ: ముఖ్యమంత్రి సహాయనిధి పేదల పాలిట వరమని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. రూ.72 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును శనివారం లబ్ధిదారు అన్నారపు శ్రావణికి ఆమె అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు నాగిళ్ల బాల్‌రెడ్డి, జౌండ్ల సత్తిరెడ్డి, శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టీపీ కో-ఆర్డినేటర్‌గా ఫ్రాన్సిస్ విజయ్‌కుమార్

గౌతంనగర్: వైఎస్సార్‌టీపీ మల్కాజిగిరి అసెంబ్లీ నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా మోటపోతుల ఫ్రాన్సిస్ విజయ్‌కుమార్ నిలమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షురాలు షర్మిల శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేసినట్లు ఫ్రాన్సిస్ విజయ్‌కుమార్ తెలిపారు. తనపై నమ్మకంతో కోఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించిన అధ్యక్షురాలు షర్మిలకు కృతజ్ఞతలు తెలిపారు.

వేతన సవరణ చేయాలంటూ నిరసన

ఉప్పల్: ఆర్టీజన్ల ఏపీఎస్ఈబీ నిబంధనలు అమలు చేయాలని, విద్యార్హతలను బట్టి పదోన్నతులను కల్పించాలని డిమాండ్ చేస్తూ శనివారం హబ్సిగూడ ఎస్ఈ కార్యాలయం వద్ద విద్యుత్ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. పెండింగ్‌లో ఉన్న పీఆర్సీతోపాటు ఉద్యోగుల ఓల్డ్ పెన్షన్ స్కీమ్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈ రాముడు, ఎం. సూర్యనారాయణ, మంద నిరంజన్ రెడ్డి, జహంగీర్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యావలంటీర్లకు జీతాలు అందజేత

మల్లాపూర్: మల్లాపూర్ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో విద్యావలంటీర్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బీఎల్ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి సొంతంగా మూడు నెలల జీతం రూ.78 వేలను శనివారం అందజేశారు. కార్యక్రమంలో మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి, కటార్ల భాస్కర్, లంబూ శ్రీనివాస్ గౌడ్, ఉపాధ్యాయురాలు సంధ్య రాణి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా పాఠశాల వార్షికోత్సవం

ఉప్పల్: జోషి విద్యానికేతన్ పాఠశాల వార్షికోత్సవం ఉప్పల్‌లో వేడుకగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చిలుకానగర్ బీఆర్ఎస్ నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు.

యాజమాన్యం నిరంతరం శ్రమించి ఎంతో మంది విద్యార్థులను తీర్చి దిద్దిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కరెస్పాండెంట్ జగదీష్ జోషి, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలి



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్

మల్కాజిగిరి: నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలని ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్ విభాగం అధికారులకు సూచించారు. శనివారం డివిజన్ పరిధిలోని కల్యాణ్‌నగర్‌లో రూ 45 లక్షలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. వేసవి కాలంలో నిర్ణీత కాలపరిమితి ఏర్పాటు చేసుకొని పనులు పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో రాజీ పడవద్దని అధికారులకు సూచించారు.

దాబాపై సేంద్రియ సాగుకు ఉత్తమ బహుమతి

అల్వాల్: ఇంటిపై కూరగాయల సాగు, చేపల పెంపకం చేస్తున్న అల్వాల్‌కు చెందిన కేబి నాగమయ్య దంపతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా ఇచ్చే ఉత్తమ పర్యావరణ పరిరక్షణ సాగు కేంద్ర నిర్వాహకులుగా అవార్డును అందజేశారు. ఇంటిని ఉద్యానవనంగా మార్చి కూరగాయలు, పండ్లు సేంద్రియ ఎరువులతో సాగు చేయడంతోపాటు దాబాపైన చేపల సాగును నిర్వహిస్తున్నారు. తమ కృషిని గుర్తించిన హార్టికల్చర్ విభాగం ఉత్తమ బహుమతిని ప్రకటించింది.

బచపన్‌లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

మేడిపల్లి: పీర్జాదిగూడ నగర పాలక సంస్థ పరిధిలోని మల్లికార్జున్‌నగర్‌లో ఉన్న బచపన్ స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను వైభవంగా నిర్వహించారు.

ప్రవాస భారతీయుల సహకారంతో తెలంగాణ మనబడి



పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ పావనీరెడ్డి

కుషాయిగూడ: ప్రవాస భారతీయుల సహకారంతోనే తెలంగాణలో తెలంగాణ మనబడి ప్రాజెక్టును నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరమ్ (టీడీఎఫ్) ఇండియా జనరల్ సెక్రటరీ మట్టా రాజేశ్వర్‌రెడ్డి తెలిపారు. మనబడి కార్యక్రమంలో భాగంగా కుషాయిగూడలోని శిశుమందిర్ పాఠశాలలో నిర్మిస్తున్న పాఠశాల భవన నిర్మాణ పనులను శనివారం మాజీ కార్పొరేటర్ పజ్జూరి పావనీరెడ్డితో కలిసి పరిశీలించారు. శిశుమందిర్‌లో చేపట్టిన భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

గౌతంనగర్: విద్యార్థులు కష్టపడి కాకుండా ఇష్టపడి చదవాలని డీఈఓ విజయకుమారి అన్నారు. శనివారం లక్ష్మీ సాయి గార్డెన్స్‌లో మల్కాజిగిరి అల్వాల్ ప్రైవేట్ పాఠశాలల మేనేజిమెంట్ అసోషియేషన్ ఆధ్వర్యంలో 10వ తరగతి విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఈఓ విజయకుమార్, సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో సెల్‌ఫోన్ వాడవద్దన్నారు. ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తూ పరీక్షలు బాగా రాయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ శశిధర్, ప్రైవేట్ పాఠశాలల మేనేజిమెట్ అసోషియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వీధి కుక్కలతో జాగ్రత్తగా ఉండాలి

కాప్రా: వీధి కుక్కలతో అప్రమత్తంగా ఉండాలని కాప్రా సర్కిల్ డీసీ శంకర్ విద్యార్థులకు సూచించారు. శనివారం కాప్రా జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కుక్కలు అరుస్తూ వచ్చేటపుడు నిశ్శబ్దంగా ఉండి కదలకుండా ఉండాలని సూచించారు. భయంతో పరుగులు పెడితే కుక్కలు దాడి చేసే ప్రమాదం ఉందన్నారు.

సంక్షేమం కాంగ్రెస్ తోనే సాధ్యం

అల్వాల్: ప్రజా సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ అన్నారు. హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర శనివారం మచ్చబొల్లారం డివిజన్ పరిధిలో నిర్వహించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ఉప్పల్ : ఉప్పల్ మినీ శిల్పారామంలో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలు శనివారం అహూతులను అలరించాయి. రమణి సద్ది ఆధ్వర్యంలో స్వరాలయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మ్యూజిక్ గురువు పద్మావతి శిష్యబృందం కర్ణాటక గాత్ర సంగీత కచేరి ఇచ్చింది. అన్న మాచార్య సంకీర్తనలో తాండవ నృత్యకారి ఆడెను శివుడు, బాల గోపాల తరంగం,తక్కువేమి మనకు, కులుకాగ నడవరో, దుర్గే అందుకో రావయ్యా, తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించారు. బడంగ్ పేట మున్సిపల్ మేయర్ పారిజాత ముఖ్యఅతిథిగా హాజరై కళాకారులను సత్కరించారు.



కాంగ్రెస్‌తోనే పేద ప్రజలకు న్యాయం

మల్లాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వంలోనే పేద ప్రజలకు న్యాయం జరుగు తుందని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాగిడి లక్ష్మారెడ్డి, నియోజకవర్గ బి బ్లాక్ అధ్యక్షులు సింగిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి అన్నారు. శనివారం నాచారం చౌరస్తా వద్ద వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి హాత్ సే హాత్ జోడో యాత్రను ప్రారంభించారు. బాబానగర్, దుర్గానగర్, సింగం చెరువు తండా వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాల వల్ల నిత్యావసర సరుకులు, గ్యాస్, పెట్రోల్ ధరలు పెరిగాయన్నారు. ప్రజా ప్రతినిధులు సమస్యలను వదిలేసి తమ ఖజానా నింపుకుంటున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ నేతలు మేకల శివారెడ్డి, రాఘవరెడ్డి, పత్తి కుమార్ పాల్గొన్నారు.